క్లుప్తంగా

మట్టి ట్రాక్టర్ల పట్టివేత

ఇటిక్యాల: అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నట్లు ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ ఆదివారం తెలిపారు. మండల పరిధిలోని పెద్దదిన్నే గ్రామ సమీపంలో అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్నారన్నా సమాచారంతో దాడి చేసి రెండు ట్రాక్టర్లు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి సోమవారం తహసీల్దార్‌కు బైండోవర్ చేయనున్నట్లు పేర్కొన్నారు.

కార్యకర్తలే బీఆర్‌ఎస్‌కు పట్టుగొమ్మలు



ఎర్రవల్లి: కార్యకర్తలే బీఆర్ఎస్ పార్టీకి పట్టుకొమ్మలని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులుగౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పల్లె నిర్మల రాజు నివాసంలో ఏర్పాటు చేసిన తేనేటీ విందులో ఆయన పాల్గొన్నారు. పార్టీ బలోపేతం కోసం చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించి పార్టీ నాయకులతో చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు సిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంబరాలకు ఆర్థిక సాయం



అయిజ: మండలంలోని తొత్తినోనిదొడ్డి గ్రామంలో గుడ్ ఫ్రైడే సందర్భంగా నిర్వహించనున్న రైతు సంబరాలకు(ఎడ్ల బండ్ల గిరక పోటీలు) మూలగుండం శాంత కుమారి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనంతో జ్ఞానం సిద్ధిస్తుంది



ఆత్మకూర్: త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో మండలంలోని వీరరాఘవపూర్‌లో భగవద్గీత ప్రచార ఊరేగింపు నిర్వహించారు. ఈసందర్భంగా ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల సందేశాలు, భగవద్గీత శ్లోకాలను వినిపించారు. భగవద్గీత పఠనంతో జ్ఞానం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. విశ్వావసునామ సంవత్సరం, శ్రీరామనవమి విశేషాలను వివరించారు. అలాగే త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో కొత్తకోట ప్రబోధ సేవా సమితి నిర్వాహకులు విజయభాస్కర్‌రెడ్డి, రాఘవేంద్రాచారి, రవి, యాది, మనోహర్, మంజుల, సబిత, సుదర్శన్, బాలరాజు, అంజనేయులు, ఉమారాణి, లావన్య, స్వప్న, కాలమ్మ, సువర్ణ, భాగ్య, శ్రీనివాస్‌రెడ్డి, రామచంద్రయ్య భక్తులు పాల్గొన్నారు.

బీసీల ఆరాధ్యుడు బీపీ మండల్



కొత్తకోట రూరల్: బీసీల ఆరాధ్యుడు బీపీ మండల్ అని బీసీ నాయకులు కొనియాడారు. ఆదివారం బీపీ మండల్ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణ కేంద్రంలో వివిధ పార్టీలకు చెందిన బీసీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ సమాజంలో బీసీలు ఎదుర్కొంటున్న వివక్షను ప్రశ్నించి ముఖ్యమంత్రి పీఠాన్ని సైతం వదులుకున్న గొప్ప వ్యక్తి బీపీ మండల్ అని అన్నారు. కార్యక్రమంలో రాములుయాదవ్, మాజీ కౌన్సిలర్ చీర్ల నాగన్నసాగర్, వెంకటన్నగౌడ్, న్యాయవాది రాములుయాదవ్, హోటల్ కురుమూర్తి, వహీద్, విజయ్, జక్కన్న, ఖదీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్నా పట్టించుకోరా?

- శిథిలావస్థలో పీహెచ్‌సీ భవనం
- పెచ్చులూడిపడుతున్న పైకప్పు
- భయాందోళనలో సిబ్బంది, రోగులు



కంప్యూటర్ గదిలో పెచ్చులూడిన పైకప్పు

అయిజ: మున్సిపల్ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం శిథిలమై పైకప్పు పెచ్చులూడిపడటంతో రోగులు, సిబ్బందికి కంటిమీద కునుకులేకుండా పోయింది. ఏడాది వ్యవధిలో నాలుగుసార్లు పైకప్పు పెచ్చులూడిటంతో భయాందోళనలో ఉన్నారు. వైద్య సేవల్లో రాష్ట్రస్థాయిలో గుర్తింపు ఉన్నా మౌలిక వసతుల లేమితో కొట్టుమిట్టాడుతోంది. నెల రోజుల క్రితం కంప్యూటర్ గది, నర్సులు రోగులకు మందులు ఇచ్చే గది పైకప్పు పెచ్చులూడి పడింది. రాత్రి సమయం, ఎవరు లేని చోట పడటంతో ప్రమాదం తప్పింది.

ఏళ్ల తరబడి తిష్టవేసిన సమస్యలు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏళ్ల తరబడి



శిథిలావస్థలో పీహెచ్‌సీ భవనం

సమస్యలు వేధిస్తున్నా నాయకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పీహెచ్‌సీ భవనం శిథిలావస్థలో ఉన్నా పునర్నిర్మాణం చేపట్టకపోవడంతో ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయం భయంగా విధులు నిర్వర్తిస్తున్నారు.

రాష్ట్రంలోనే ప్రథమ స్థానం

పీహెచ్‌సీకి రోజుకు సుమారు 200 మంది ఔట్ పేషెంట్లు, 20 మంది వరకు ఇన్‌పేషెంట్లు వస్తుంటారు. రాష్ట్రంలో 2015- 2016, 2023 సంవత్సరంలో అత్యధికంగా ప్రసవాలు చేయడంతో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. వైద్య సేవలు విస్తృతంగా అందిస్తున్నా మౌలిక సదుపాయాల కొరత వేధిస్తున్నట్లు ఇటు సిబ్బంది, అటు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నాయకులు, ఉన్నతాధికారులు పట్టించుకొని నూతన భవన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.



హాల్లో పెచ్చులూడిపడిన పైకప్పు

బీటలు వారిన గోడలు



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గోడలు బీటలు వారాయి. పైకప్పు తరుచూ పెచ్చులూడిపడుతోంది. దీంతో రోగులు భయాందోళనకు గురవుతున్నారు. ఆస్పత్రి సిబ్బంది కూడా బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. కొందరు ఆస్పత్రికి రావాలంటేనే భయపడుతున్నారు. నూతన భవనంలోకి ఆస్పత్రిని మార్చాలి.

-సురేంద్ర స్వామి, సింధనూరు

నూతన భవనం నిర్మించాలి



ప్రభుత్వ దవఖానా భవనం శిథిలమైంది. గతంలో మరమ్మతు చేయించినా ఫలితం లేదు. అవసరమైతే ఆస్పత్రిని నూతన భవనంలోకి మార్చాలి. ఆస్పత్రిలోని రోగులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. అదే విధంగా మౌలిక వసతులు కల్పించాలి. ప్రజా ప్రతినిధులు వెంటనే చర్యలు తీసుకోవాలి

- వెంకటేష్, అయిజ

ఉన్నతాధికారులకు తెలియజేశాం



పీహెసీలో పైకప్పు పెచ్చులు ఊడిపడటం తదితర సమస్యల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇటీవ కలెక్టర్ కార్యాలయంలో సమాచారం అందజేశాం. టీజీ ఎంఎస్ఐడీసీ శాఖ అధికారులకు కూడా సమస్యను విన్నవించాం. నిధులు మంజూరైన వెంటనే మరమ్మతు చేపడుతాం.

- సిద్దప్ప, డీఎంహెచ్ఓ

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మానవపాడులో ఆత్మీయ కలయికలో పూర్వ విద్యార్థులు



గట్టులో సమావేశమైన పూర్వ విద్యార్థులు

గట్టు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 2011-12 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు సమావేశమయ్యారు. అలనాటి తీపి జ్ఞాపకాలు నెమరు వేసుకుని ఆనందంగా గడిపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం మేరమ్మ, ఉపాధ్యాయులు ఖాజా, వెంకటేశ్వర్‌గౌడ్, నరేష్, రియాజ్, రామచంద్రయ్య, సంజన, ఎస్తేర్‌రాణి, సుహాసిని పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 1998-99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సమావేశమయ్యారు. అలనాటి గురువులను పూలమాలలు, శాలువాతో సత్కారించారు. మెమెంటోలను అందజేశారు. మిత్రుడు విజేయుడు, హుస్సెన్, జైపాల్ రెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేశారు. విజేయుడు భార్య లావణ్యకు రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని తక్కశీల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. అలనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపినట్లు పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కేంద్రం నిధులు



గట్టు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం కూడా నిధులు విడుదల చేస్తున్నట్లు బీజేవైఎం జిల్లా కార్యదర్శి మోహన్‌చంద్ర అన్నారు. జిల్లా కౌన్సిల్ సభ్యుడు నల్లారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు నాగప్పల ఆధ్వర్యంలో గావ్ చలో.. బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా బల్గెర గ్రామంలో ఆదివారం బీజేపీ నాయకులు పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముళ్లపొదలు తొలగించండి సారూ..

శాంతినగర్: రామాపురం- వల్లూరు రహదారిలో ఉన్న ముళ్లపొదలు తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. 5 కిలోమీటర్ల దారి పొడవున ఉన్న ముళ్లపొదలతో ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు వాపోతున్నారు. దారి మూసుకుపోయి తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి ముళ్లపొదలు తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మానవపాడు: మండల కేంద్రం నుంచి గోకులపాడుకు వెళ్లే రహదారి వెంట ఉన్న ముళ్లపొదలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. చెట్లు రోడ్డుపైకి రావడంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు వాపోతున్నారు. అధికారులు స్పందించి ముళ్లపొదలు తొలగించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



ముళ్లపొదలతో మూసుకుపోయిన వల్లూరు రోడ్డు

చౌడేశ్వరీ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన



గోపాల్‌పేట: గ్రామదేవతలు మన సంస్కృతి సంప్రదాయాలకు చిహ్నాలుగా నిలుస్తాయని మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఏదుల మండలంలోని చెన్నారంలో నూతనంగా నిర్మించిన చౌడేశ్వరీదేవి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



కుర్తిరావుల్‌చెర్వులో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు



ధరూరు ఎంబీ షాలేము చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ధరూరు: మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు మండలంలో ఘనంగా జరుపుకున్నారు. గుడ్ ఫ్రైడేకి ముందు ఏసుక్రీస్తు అనుభవించిన శ్రమల దినాలను స్మరించుకుంటూ అందుకు సాదృశ్యంగా మట్టల ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఎంబీ షాలేం చర్చి పాస్టర్ రవికుమార్ తెలిపారు. క్రీస్తును స్మరిస్తు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఈత మట్టలు చేత పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: మండల పరిధిలోని కుర్తిరావుల్‌చెర్వు, పాల్వాయి, మల్దకల్ గ్రామాల్లో క్రైస్తవులు ఈత మట్టలు చేత పట్టుకుని గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఏసుక్రీస్తు శ్రమల దినాలను నెమరు వేసుకుంటూ ప్రార్థనలు చేశారు. అనంతరం ఈత మట్టలను పట్టుకుని ర్యాలీ చేశారు. కార్యక్రమంలో మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

ఎర్రవల్లి: మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో సోమవారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని నూతన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖులు, మేధావులు, ప్రజా సంఘాల నాయకులు, అంబేడ్కర్ అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జార్జిరెడ్డి స్ఫూర్తితో ముందుకు సాగుదాం

కొత్తకోట రూరల్: అట్టడుగు పేద వర్గాలు, మహిళలకు, విద్య కావాలని ఆధిపత్య వర్గాలను ఎదిరించి విద్యార్థుల, మహిళల సమస్యల పరిష్కారం కోసం పోరాడిన జార్జిరెడ్డి స్ఫూర్తితో నేటితరం విద్యార్థులు ముందుకు సాగాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. ఆదివారం కొత్తకోటలోని బీసీ బాలుర హాస్టల్‌లో జార్జిరెడ్డి 53వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జార్జి బతికుంటే తమ దౌర్జన్యాలు సాగవని మనువాదులు పన్నాగం పన్ని కత్తులతో దాడి చేసి హతమార్చినా.. నాటి నుంచి నేటి వరకు ప్రగతిశీల గొంతులు జార్జీ ఆశయాన్ని నినదిస్తూనే ఉందన్నారు. దేశంలో మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాద, మనువాద రాజ్య స్థాపన కోసం తీవ్రంగా ప్రయత్నిస్తుందని ఆరోపించారు. మోడీ విధానాలు దేశ లౌకిక వ్యవస్థకు, భిన్నత్వంలో ఏకత్వ స్ఫూర్తికి పెను ప్రమాదకరంగా మార్చుతూ విద్యా సంస్థలను మత ప్రయోగశాలలుగా మార్చేందుకు, నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చి విద్యారంగాన్ని పూర్తిగా కాషాయీకరించే కుట్రపూరిత చర్యలకు ఒడిగట్టిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నవీన్, శంకర్, ప్రభు, తరుణ్, నరేష్, రమేష్, కాశీం, శివ, గోపి, ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో ఉన్నత శిఖరాలకు



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న సరిత

గద్వాలటౌన్: క్రీడాస్ఫూర్తితో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, మున్సిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్ అన్నారు. స్థానిక ఇండోర్ స్టేడియంలో జేకే బిల్డర్స్ ఆధ్వర్యంలో జరిగే బీఎస్‌కే టెన్నిస్ లీగ్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవంలో ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రతి క్రీడాకారుడు జాతీయ స్థాయి పోటీలను లక్ష్యంగా నిర్దేశించుకొని ఆడాలని సూచించారు. ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలని సూచించారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు, మానసిక దృఢత్వం లభిస్తుందన్నారు. గెలుపోటముల కంటే పోటీల్లో క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించడం ప్రధానమన్నారు. అనంతరం టోర్నీ విజేత శ్రీనిధి డయాగ్నోస్టిక్ జట్టుకు రూ.80 వేలు, రన్నర్‌గా నిలిచిన ఎస్ఎఫ్ బ్యాటరీస్ జట్టుకు రూ.40 వేల నగదుతో పాటు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ జితేందర్, కాంగ్రెస్ నాయకులు శంకర్, కోటేష్, యల్లప్ప, ఇసాక్, కబీర్‌దాసు నర్సింహ, భాస్కర్‌యాదవ్, పులిపాటి వెంకటేష్, మహేష్, జగదీష్, శ్రీనివాస్‌గౌడ్, సత్యం, రాజశేఖర్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'రాజీలేని పోరాటం యూటీఎఫ్ సొంతం'



జెండా ఆవిష్కరణలో యూటీఎఫ్ నాయకులు

గద్వాలటౌన్: రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక కార్యాలయంపై ఏర్పాటు చేసిన యూటీఎఫ్ జెండాను సీనియర్ నాయకుడు రామన్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ నిరంతరం శ్రమించిందని పేర్కొన్నారు. అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. సామాజిక స్పృహ కల్గిన సంఘంగా కరోనా సమయంలో సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. గత 12 ఏళ్లుగా వివిధ యాజమాన్యాల పరిధిలోని ఉపాధ్యాయుల సంక్షేమం కోసం అనేక పోరాటాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్, నాయకులు బీసన్న, వెంకటరమణ, రాజశేఖర్, అంజనేయులు, స్వామిరెడ్డి, మోహన్‌కుమార్, బీచుపల్లి, సుదర్శన్, భాస్కర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించిన కాంగ్రెస్



కేటీదొడ్డిలో అంబేడ్కర్ విగ్రహాన్ని నీటితో శుద్ధి చేస్తున్న బీజేపీ నాయకులు



ఉదండాపురంలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న నాయకులు

ఇటిక్యాల: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ని అవమానించిన పార్టీ కాంగ్రెస్ అని బీజేపీ మండలాధ్యక్షుడు షేక్ అబ్దుల్లా విమర్శించారు. ఆదివారం మండల పరిధిలోని ఉదండాపురంలో పార్టీ నాయకులతో కలసి అంబేడ్కర్ జయంతి ఉత్సావాల్లో భాగంగా అంబేడ్కర్ విగ్రహాన్ని నీటితో కడిగి శుద్ధి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్‌ను ఎన్నికల్లో ఓడగొట్టి ఆయన్ను అవమానించింది కాంగ్రెస్ పార్టీయేనని మండిపడ్డారు. బీజేపీ అంబేడ్కర్ ఆశయ సాధనతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు తిమ్మారెడ్డి, గోవింద్, కృష్ణ, మహమ్మద్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: అంబేడ్కర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీపాదరెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. భారతరత్న పురస్కారం ఇచ్చి అంబేడ్కర్‌ను బీజేపీ గౌరవించిందన్నారు. కార్యక్రమంలో వీరన్న, రాములు, సూర్యకాంత్ రెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు హనుమంతు, రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

పారుతున్న మురుగు.. పట్టని అధికారులు



అలంపూర్ చౌరస్తాలో నిలిచిన మురుగు

అలంపూర్: పట్టణంలోని ప్రముఖ దేవస్థాన రహదారిలో మురుగుతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలంపూర్ చౌరస్తాలోని అలంపూర్ రోడ్డు మార్గంలో గత వారం రోజులుగా మురుగుతో ప్రజలు అల్లాడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షంతో రోడ్డు పక్కనే వర్షపు నిలిచింది. డ్రైనేజీలు లేకపోవడంతో దుకాణాల ముందు నిలిచిన వర్షపు నీరు మురుగుగా మారి దుర్వాసన వెదజల్లుతుంది, దోమలకు ఆవాసంగాగా మారిందని ప్రజలు వాపోతున్నారు. పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సిన అధికారులు కనీస చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మురుగు తొలగించడానికి చర్యలు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

రహదారికి మరమ్మతు చేపట్టాలి

మల్దకల్: మండలంలోని తాటికుంట బీటీ రహదారిపై ఏర్పడిన గుంతలకు మరమ్మతు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. నిత్యం రహదారిపై వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. 10ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన బీటీ రోడ్డుపై రైతులు రోడ్డు తవ్వి పైపులైన్లను ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం ఎలాంటి మరమ్మతు చేపట్టకపోవడంపై ప్రమాదాల బారిన పడుతున్నట్లు వాపోతున్నారు. అధికారులు గుంతలకు మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



తాటికుంట రోడ్డుపై ఏర్పడిన గుంతలు